

# అంచనా

రెంటాల హనుమంత ప్రసాద్

రైలు కదిలింది. అట్లా కదలటం నేను కూర్చున్న పెట్టెలోనికి ఓ ఇద్దరు అమ్మాయిలు రావటం ఒకే సారి జరిగాయి. నా ఎదురు బెంచి ఖాళీగానే వున్నది. అందులో ఒకమ్మాయి బాగా పొడుగ్గా ఎఱ్ఱగా వుండి చూడంగానే ఇట్టే ఆకర్షించగలుగు తున్నది. రెండో అమ్మాయి కొద్దిగా పొట్టిగా వుండి మొదటి అమ్మాయి కంటె ఓ పిసరు ఛాయ తక్కువగా నున్నది.

ఇద్దరూ సీతాకోక చిలుకల్లా అందంగా మెరిసి పోతున్నారు. సుమారుగా ఇద్దరికీ ఒకే వయస్సు వుంటుందనుకున్నాను. వాళ్ళిద్దరు నా ఎదురుగా వున్న బెంచి మీద కూర్చున్నారు.

రైలుబండి బాగా స్పీడ్ అందుకుంది. వాళ్ళిద్దరు నా వంక ఓ మారు చూశారు. వాళ్ళనే చూస్తున్న నేను నా చూపుల్ని మరల్చుకుని కిటికీలో కుండా పచ్చని పొలాలను, విడిపోతూ కలుసుకుంటున్న టెలిగ్రాఫ్ తీగలను చూస్తూ వుండిపోయాను.

"ఇంకొక్క ఫైవ్ మినిట్స్ నీవు లేటుగా వచ్చినట్లయితే బండి మిస్ అయ్యేది." వాళ్ళల్లో ఒక అమ్మాయి అన్నది రెండో అమ్మాయితో.

"సారీ సుజా ! నేను హాస్టల్ నుండి తొందర గానే బయలుదేరాను. కానీ ఈ నవల ఎక్కడా దొరకలేదు. దీనికోసం నాలుగైదు షాపులు గాలించ వలసివచ్చింది." చేతిలో వున్న నవలను ఓ మారు చూసుకుంటూ అన్నది పొడుగుపాటి అమ్మాయి.

అందులో ఒకమ్మాయి పేరు సుజాత అని తెలిసింది. ఏమీ తోచకపోవటంతో వాళ్ళ సంభాషణ వినటం మొదలుపెట్టాను.

"ప్చ్ ! నీకా నవలల పిచ్చి వదలదు. ఎన్నిసార్లు చెప్పినా వినవు. తీరా బండి కదిలేటప్పుడుగాని నీవు రావు. ఈ బండి మిస్ అయినట్లయితే మళ్లీ ఎప్పటికోగాని బండి లేదు. అప్పటిదాకా స్టేషన్‌లో వెయిట్ చేస్తూ కూర్చోవలసి వచ్చేది." చిరుకోపంగా అన్నది సుజాత.

"అబ్బ పోనిద్దూ ! వచ్చేనుగా. ఒకవేళ బండి పోయినట్లయితే ఈ నవల వల్ల మనకు టైమ్ పాస్ అయ్యేది." చేతిలో వున్న నవల పేజీలను త్రిప్పుతూ అన్నది పొడుగుపాటి అమ్మాయి.

"నవల పేరేమిటి ?" అడిగింది సుజాత.

"వలపు కోసం" జవాబిచ్చింది.

"రచయిత పేరు"

"రజనీకాంత్" ఉత్సాహంగా చెప్పింది పొడుగ్గా వున్న అమ్మాయి.

"అలా చెప్పు ! నీ ఫేవరెట్ రైటర్ అన్న మాట. ఇంకా ఎవరో అనుకున్నాను." నవ్వుతూ అన్నది సుజాత.

"ఇంకో రైటర్ పుస్తకమైతే నాలుగు కొట్లు తిరిగి పుస్తకాన్ని సంపాదించాలా. రజనీకాంత్ నవ కాబట్టే నాలుగు కొట్లు తిరగవలసివచ్చింది' పొడుగుపాటి అమ్మాయి అన్నది గర్వంగా.

"హు ! నీ పిచ్చి నీది" నవ్వింది సుజాత.

"నీకు ఎగతాళిగా వున్నట్లున్నది. నీవెప్పుడన్నా రజనీకాంత్ నవలలు చదివి వుంటేగా. అసలింత వరకు ఏ నవలైనా చదివి ఏడిస్తేగా" కోపంగ అన్నది పొడుగుపాటి అమ్మాయి.

పొడుగుపాటి అమ్మాయి ఉడుకుమోత్తనానికి నాకు నవ్వు వచ్చింది. రెండో అమ్మాయి పేరు సుజాత అని తెలిసిందిగాని మొదటి అమ్మాయి పేరు ఇంకా నాకు తెలియలేదు.

"ఏం ? అంత బాగుంటాయా అతని నవలలు" నవ్వుతూ అన్నది సుజాత.

"అమోఘంగా రాస్తాడు. కావాలంటే ఈ నవల చదివిచూడు నీకే తెలుస్తుంది. అబ్బ ! అతను ఎలారాస్తాడో నీకెలా చెబితే తెలుస్తుంది..." ఆ అమ్మాయి తబ్బిబ్బవుతున్నది తను చెప్పదలుచు కున్నది ఎలా చెప్పాలో తెలియక.

పొడుగుపాటి అమ్మాయి మాటలకు నవ్వు కున్నాను.

"సార్ ! అగ్గిపెట్టె వుంటే ఓసారిలా ఇస్తారా !" ప్రక్కన కూర్చున్న అతను నన్ను అడిగాడు.

నాకు సిగరెట్లు తాగే అలవాటుంది. జేబులో వున్న అగ్గిపెట్టె అతనికి ఇచ్చాను. సిగరెట్ వెలిగించుకుని అగ్గిపెట్టె తిరిగి ఇస్తూ "థాంక్సు" అన్నాడు.

'నోమెన్షన్' చెప్పి అతనివంక ఓమారు చూశాను.

అతను నేను కూర్చున్న బెంచిమీద అటు చివరగా కూర్చున్నాడు. నేను కిటికీ ప్రక్కన కూర్చున్నాను. మా ఇద్దరి మధ్య ఎవ్వరూ లేరు. అతను నల్లగా వున్నాడు. పువ్వేసిపోయిన కన్ను కొట్టవచ్చినట్లు కనబడుతున్నది. స్ఫోటకం మచ్చలతో ముఖమంతా నిండివున్నది. గుడ్డలు కొద్దిగా నలిగినట్లు వున్నాయి. అతనికి ఓ ముప్పయ్ ఏళ్ళు వుండవచ్చు.

"రజనీకాంత్ !" పేరు మాత్రం చాలా బాగానే వుంది" అన్నది సుజాత.

"పేరే కాదు మనిషి కూడా అందగాడై వుంటాడు."

"ఎలా చెప్పగలవు ?" ఆశ్చర్యంగా అన్నది సుజాత.

"నేను ఊహిస్తున్నాను. నా ఊహ తప్పు కాదు. అతని వర్ణనలు చాలా గొప్పగా వుంటాయి. అందాన్ని ఆరాధించే వ్యక్తి అయివుండాలి. అతని నవలలో ఆ ఆరాధన బాగా కన్పడుతుంది. అందువలన అతను అందగాడై వుంటాడని గట్టిగా చెప్పగలుగుతున్నాను."

"ఏం అందగాడే అందాన్ని ఆరాధించే వ్యక్తా. అందవికారయి వుంటే అతను అందాన్ని కోరడా? ఇష్టపడడా?" నవ్వుతూ అన్నది సుజాత.

"లేదు ! అతను అందగాడని నిస్సందేహంగా చెప్పగలను. అతడు తన కథలలోని పాత్రలను ఎంత అందంగా వర్ణించి ఎంత బాగా చిత్రీకరిస్తాడో నీకు తెలియదు" కోపంగా అన్నది పొడుగుపాటి అమ్మాయి.

"పోనీ నాకు తెలియదులే ! నీవన్నట్టు అందగాడై వుంటాడు. కాదనను. ఇంత గొప్పగా రాస్తున్నాడంటే అతను ఎంతో అనుభవమున్నవాడై వుంటాడు. బహుశా అతను చాలా ఏళ్ళు పైబడి వున్న వ్యక్తి అయివుంటాడు. కనీసం అతనికి ఓ యాభై ఏళ్ళు వుంటాయేమో" పొడుగుపాటి అమ్మాయిని కవ్విస్తున్నట్లుగా అన్నది రెండో అమ్మాయి ఐన సుజాత.

"ఛ నోర్ముయ్ ! ఎగతాళిగా వుందా" కోపంగా అన్నది పొడుగుపాటి అమ్మాయి.

ఆ అమ్మాయి ఉడుకుమోత్తనానికి నాకు నవ్వు వచ్చింది. పెద్దగానే నవ్వాను. వాళ్ళిద్దరూ నావంక చూశారు. వాళ్ళతో ఏదో ఒకటి మాట్లాడుదామనిపించింది.

నాకు ఎదురుగా కూర్చుని వున్న అమ్మాయి పేరు తెలుసుకుందామనిపించింది.

"నీ పేరేంటమ్మా" అడిగాను.

ఆ అమ్మాయి నా వంక అదోలా చూసింది. ఆ తరువాత ఏమనుకున్నదో ఏమో "నీరజ" అని చెప్పింది.

"ఏదమ్మా ! ఆ పుస్తకం ఓసారి ఇటివ్వు చూసి ఇస్తాను" అడిగాను నేను ఆ అమ్మాయిని.

చేతిలో వున్న పుస్తకాన్ని నాకు ఇచ్చింది.

"ఇతను బాగా రాస్తాడా ?" అడిగాను.

"చాలా గొప్పగా రాస్తాడు."

"చూడండి బాబాయిగారూ ! చాలాసేపటి నుండి దీని మాటలు వింటూనే వున్నారుగా ! ఆ రచయిత ముసలివాడై ఎందుకు వుండకూడదూ ?" సుజాత నాతో అన్నది.

ఆ అమ్మాయి కలుపుగోలుతనానికి మెచ్చుకున్నాను.

"ఎందుకు వుండకూడదమ్మా ! అయివుండవచ్చు" ఆ అమ్మాయి మాటలతో నేను ఏకీభవించాను.

నేను సుజాత మాటలతో ఏకీభవించటంతో నీరజ ఉడుకుమోత్తనంగా అన్నది.

"నేను మాత్రం ఛస్తే ఒప్పుకోను. అతను అందగాడై వుంటాడు. ముసలివాడు మాత్రం అయివుండడు."

"నీవు ఎలా అనుకుంటున్నావమ్మా ? ఒక వ్యక్తి గురించి అంత అభిమానం పెంచుకోవటం మంచిది కాదు. ఆ వ్యక్తి నీవు ఊహించినదానికి భిన్నంగా వున్నట్లయితే ఆ తరువాత నీవు చాలా బాధపడతావు. అందుకని మరీ అంతగా మనం ఆలోచించటం మంచిది కాదు అని నా అభిప్రాయం. ఏమంటావ్" నవ్వుతూ అన్నాను.

ఆ అమ్మాయి ఏమీ మాట్లాడలేదు. నావంక ఓసారి కోపంగా చూసి వూరుకున్నది.

"మీరు చెప్పింది కరెక్టుసార్" నా ప్రక్కన కూర్చున్న అతను నవ్వుతూ అన్నాడు. అతను నవ్వేటప్పుడు ఒక పన్ను బైటకు పొడుచుకువచ్చింది.

నా మాటలకు అతను ఏకీభవించడంతో నీరజ అతనివంక కూడా కోపంగా చూస్తూ అన్నది.

"అతను అందంగా వుండకపోతేపోయేదు కాని మీలామాత్రం వుండడని ఖంఢితంగా చెప్పగలను."

ఆ అమ్మాయి మాటలకు చివుక్కుమన్నది నా మనస్సు. ఆమె మాటల్లో బాగా హేళన తొంగిచూసింది. పాపం అందుకు తగ్గట్టుగనే అతని రూపం కూడా అలాగే వున్నది.

అతని ముఖం చిన్నబోలేదు ఆమె మాటలకు.

"ఏమో మీరన్నట్లు ఎందుకు కాకూడదు" నవ్వుతూ అన్నాడతను.

అతని మాటలకు ఆమె బాగా బాధపడ్డట్లు కనిపించింది. ఇంతలో స్టేషన్ రావటంతో నేనేదో అనబోతూ విరమించుకున్నాను.

అతను ఆ స్టేషన్‌లో దిగాలట్లున్నది. లేస్తూ అన్నాడు. ఆ అమ్మాయితో "చూడండి మిస్ ! మీరు చాలా పొరబడ్డారు. ఒక రచయిత రాతలను బట్టి అతని రూపాన్ని అంచనా వెయ్యకూడదు. మరి నేను అందగాణ్ణి కాదుగా" చిన్నగా నవ్వాడు అతను.

"అంటే" ఆశ్చర్యంగా అన్నది ఆ అమ్మాయి.

అతని మాటలకు నేను, నాతోపాటు సుజాత ఆశ్చర్యంగా అతన్నే చూస్తూ వుండిపోయాము.

ప్రక్కనే వున్న సూట్‌కేసు తీసుకుంటూ "నేనే ఆ రజనీకాంత్‌ని" అంటూ దిగిపోయాడు.

నాతోపాటు ఆ ఇద్దరు అమ్మాయిలు కూడా నోళ్ళు తెరచి వెళుతున్న అతన్నే చూస్తూ వుండిపోయాము.

## ఒక మనిషివి

ఈ శతాబ్ది
చరిత్ర వనితకు
నువ్వు
నుదుటి బొట్టు.

విన్నుగన్న
సరస్వతి
నీ పోషణలో
బ్రతికింది
బట్టగట్టింది.

ఒక మనిషి
ఒక జీవితంలో
పొందలేని
వందలెన్నో
పొందిన నువ్వు
ఒక మనిషివి !

నీ ఊపిరి
పీల్చిన
ఈ దేశం
నిన్నటికంటే
ప్రాణవంతం.

—డా. కొలకలూరి ఇనాక్

